ప్రజాశక్తి

బుధవారం 22 నవంబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

24న సదరం వైద్యశిబిరం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: వికలాంగ పిల్లలక ధ్రువీకరణ పత్రాల జారీకి ఈనెల 24న అరకులోయ ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సదరం మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మండల ఐఇఆర్‌పి ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. డుంబ్రిగుడ, అరకువేలి, అనంతగిరి మూడు మండలాలకు చెందిన సిడబ్ల్యుఎస్‌ఎన్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఆరోజున ఉదయం పది గంటలకు శిబిరానికి వచ్చి, వైద్యపరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. ఈ మేరకు మూడు మండలాల్లోని సంబంధిత ఉపాధ్యాయులు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. సదరం వైద్యశిబిరానికి వచ్చే వారు పిల్లల ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, పిల్లలు, తల్లి బ్యాంక్ ఖాతా పుస్తకం, రేషన్ కార్డు జెరాక్స్‌లను తీసుకురావాలన్నారు. మరిన్ని సమాచారం కోసం 6302226893, 9491608280 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధరనిచ్చి

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

ప్రజాశక్తి -పాడేరు : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పాడేరు ఐటిడిఎ ఆర్గానిక్ కాఫీ, మిరియాలుకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆదివాసీ కాఫీ రైతులకు యంత్రాలు, పరికరాలు ఉచితంగా పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. మంగళవారం స్థానికసంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో గిరిజన రైతులు ఉత్తరంగా పండిస్తున్న కాఫీ, మిరియాల పంటలు ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్నాయన్నారు. 70 వేలమంది ఆదివాసి కాఫీ రైతులు సుమారు లక్షా 50 వేల ఎకరాల్లో ఏటా15 వేల మెట్రిక్ టన్నులు కాఫీ దిగుబడి చేస్తున్నారన్నారు. అయితే వీటికి సరైన గిట్టుబాటు ధర లేక, దళారీల చేతుల్లో గిరిజన కాఫీ రైతులు మోసాలకు గురై నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకొని కాఫీ. మిరియాల ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు.

పార్చ్ మెంట్ కాఫీ కిలో రూ.500 చెర్రీ కాఫీ కిలో రూ.250 పండు కాఫీ కిలో రూ.100, మిరియాలు కిలో రూ.1000 చొప్పున కొనుగోలు చేయాలని కోరారు మిరియాల పంట సేకరణకు వ్యక్తిగత నిచ్చెనలు ప్రతి రైతుకూ ఇవ్వాలని, కాఫీ పంట ఆరబెట్టుకునేందుకు సిమెంట్ కల్లాలు ఏర్పాటు, పల్పర్లు, టార్పాలిన్లు ఉచితంగా ఇవ్వాలని కోరారు. రైతులకు రాయితీలు, రుణాలు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. జి20 సదస్సులో దేశ విదేశాల ప్రతినిధులను మంత్రముగ్ధుల్ని చేసిన అరకు కాఫీకి, కనీసం గిట్టుబాటు ధర లేకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం అత్యంత దుర్మార్గమని, తక్షణమే ప్రభుత్వం ఐటిడిఎ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, గిట్టుబాటు ధరనిచ్చి కాఫీ, మిరియాలను కొనుగోలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు యస్ ధర్మన్నపడాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ కొండలరావు జిల్లా నాయకులు పి సురేష్ కుమార్, ఆదివాసీ కాఫీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ జి చిన్నబాబు పాల్గొన్నారు

మారుమూల ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

మాట్లాడుతున్న ప్రధాని కార్యాలయ అదనపు కార్యదర్శి అతీష్‌చంద్ర

ప్రజాశక్తి -పాడేరు: మారుమూల ప్రాంతాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి అదనపు కార్యదర్శి అతీష్ చంద్ర స్పష్టం చేసారు. జిల్లాలో వికసిత సంకల్పయాత్ర విజయవంతంగా జరుగుతోందని సంతృప్తి వ్యక్తం చేసారు. మంగళవారం మండలంలోని వంట్లమామిడి గ్రామంలో వికసిత సంకల్ప యాత్ర సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2047 నాటికి దేశం సంపూర్ణ అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎపిలో గ్రామ సచివాలయ వ్యవస్థ సేవలు బాగున్నాయన్నారు.

కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా భౌగోళిక పరిస్థితులను, మూడు ఐటిడిఎల ద్వారా గిరిజనులకు అందిస్తున్న సేవలను వివరించారు. ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అందిస్తూ, గిరిజనాభివద్ధికి కషి చేస్తున్నామన్నారు.

ముందుగా వంట్లమామిడి సచివాలయాన్ని సందర్శించిన అదనపు సెక్రటరీ, అక్కడ సేవలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం వద్ద మొక్కను నాటారు. అనంతరం వికసిత సంకల్ప యాత్రపై ఐటిడిఏ ఫోటో ప్రదర్శన, జిసిసి, డిఆర్‌డిఎ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. వికసిత సంకల్ప యాత్రపై ప్రతిజ్ఞ చేయించారు. పది మందికి ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లను, అటవీ హక్కుపత్రాలు, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్డులు పంపిణీ చేసారు. సమావేశంలో గ్రామ వార్డు సచివాలయ విభాగం అదనపు సంచాలకులు భావన, జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, పోర్టు వైస్‌చైర్మన్ దురేష్ కుమార్ దూబే, ఐటిడిఎ ఎపిఒలు విఎన్.ప్రభాకర్, ఎం. వేంకటేశ్వరరావు, ఎఎఒ శీనివాస కుమార్, డిఎల్‌డిఒ శాంతకుమారి, ఎంపిడిఒనవీన్, వంట్లమామిడి సర్పంచ్ పాంగి రాంబాబు, ఎంపిటిసి టి. ఈశ్వరరావు, పాల్గొన్నారు.

సమస్యలను విన్నవిస్తున్న సర్పంచ్ చిట్టిబాబు

అరకులోయ: : మండలంలోని సుంకరమెట్ట పంచాయతీలో సర్పంచ్ జి.చిన్న బాబు అధ్యక్షతన నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశం ప్రధానమంత్రి అడిషనల్ సెక్రటరీ అతీష్ చంద్ర పాల్గొని కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు ప్రవేశపెట్టిన వివిధ పథకాలను వివరించారు.

ఈ సందర్భంగా గిరిజనులు పండిస్తున్న కాఫీ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, దళారుల వ్యవస్థ నిర్మూలించాలని, అర్హులైన గిరిజనులందరికి పోడు పట్టాలు మంజూరు చేయాలని, నూతన అటవీ విధానం రద్దు చేయాలని, జలజీవన్ మిషన్ నిధులు పెంచాలని సుంకరమెట్ట పంచాయతీ సిపిఎం సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు కోరారు.

వాలసిలో వైద్యశిబిరం

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని వాలసి పంచాయతీ కేంద్రంలో మంగళ వారం మాతృభూమి సేవా సంస్థ అధ్యక్షులు, సామాజిక వైద్యులు కె. నగేష్, కార్యదర్శి ఇ, గోపాల రావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు శీతాకాలం చలిని దృష్టిలో పెటుకుని వృద్ధులకు రగ్గులు, బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపి, సంస్థ ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాతల్లో వర్షం గుబులు!

- వరికోతల సమయంతో చినుకులతో ఆందోళన
- కోసిన చేను చక్కబెట్టే పనుల్లో గిరిరైతులు బిజీ

ముంచంగిపుట్టులో వరిచేను కుప్పకు టార్పాలిన్ కప్పుతున్న రైతు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ఇన్నాళ్లు సాగునీటి కోసం వర్షం కురవాలని ఆకాశానికేసి ఎదురుచూసిన రైతన్నలకు, ఇపుడు కష్టబడి పండించిన పంట చేతికి వచ్చే దశలో చిరుజల్లులు పడుతుండడంతో గుబులు చెందుతున్నారు. తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఆకాశం మేఘావృతమై వీడకుండా వర్షపు జల్లులు కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వరి, రాగులు, సాములతో పాటు వాణిజ్య పంటలు కోతలు, నూర్పులు ముమ్మరంగా జరుగుతూ, పంట చేతికి వచ్చే సమయంలో అవాంఛిత వర్షం ఇపుడు పడుతుండడంతో దిగులు చెందుతున్నారు. దీంతో గిరిజన రైతులకు పంట నష్టం వాటిల్లుతుందనే భయంతో కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పలు గ్రామాలలో ముమ్మరంగా కోతలు కోసిన వరి పనలు పొలంలోనే తడిసి ముద్దయ్యాయి. మరికొన్ని గ్రామాలలో కోసిన వరి పనలను తడి ఆరకుండానే కట్టలు కట్టి కల్లాల వద్ద తీసుకువెళ్లి కుప్పలుగా వేసి, వాటిపై టార్పాలిన్లు కప్పి సంరక్షించే పనుల్లో నిమగ్నమై రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. చేతికి అందిన పంటలు పోగొట్టుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.పలుచోట్ల కోసిన పంటలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముంచింగిపుట్టులో ముసురు వాతావరణం రైతులకు గుండెల్లో దడ పుట్టిస్తోంది. గత నెలలో సైతం కురిసిన వర్షాలకు రాజ్మా, కంది, వాణిజ్య పంటలు నష్టపోగా, ఇపుడు వరిపంటకు అదే పరిస్థిత రావడంతో రైతన్నలు కలవరం చెందుతున్నారు.

పెదబయలు : అల్పపీడన ప్రభావంతో హఠాత్తుగా ఆకాశం మేఘావృతమై కురుస్తున్న వర్షపు జల్లులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లు వర్షాభావంతో పంటలను కాపాడుకోవడానికి సాగునీటి కోసం అవస్థలు పడిన గిరిజన రైతులు, ఇపుడు పంట కోసి, చక్కబెట్టే సమయంలో వర్షం కురుస్తుండడంతో కోసిన వరిచేనును చక్కబెట్టే పనుల్లో బిజీగా ఉన్నారు.

పెదబయలులో ఆదరాబాదరగా చేను తరలిస్తున్న రైతులు... కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కోసిన వరిచేనును మోసుకుంటూ, ట్రాక్టర్లపై సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఆరుగాలం ఇంటిల్లిపాది శ్రమించి, పండించిన పంట, ఇపుడు చేతికొచ్చే దశలో తడిసిపోచే పరిస్థితి ఉండడంతో రైతన్నలు తల్లడిల్లుతున్నారు.

డుంబ్రిగుడ: మండలంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాతావరణం మేఘావృతమై చినుకులు పడ్డాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. వరి పంట కోత కోసిన గిరిజనులు పంటలు తడిసి పాడవుతాయని ఆందోళన చెందుతున్నారు. వరి కుప్పలు చేసిన గిరిజనులు కుప్పల పైన టార్పన్లు కప్పి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కొయ్యూరు, సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు, జికె.వీధి మండలాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వర్షం చిన్న దుమారంలా చినుకులు పడుతూ, ఆగుతూ ఎండ కాస్తూ భిన్న వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత మబ్బులతో కూడిన వాతావరణం చోటుచేసుకొని, సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పాఠశాల విడిచి పెట్టడంతో సీలేరులో విద్యార్థులు తడుచుకుంటూ ఇళ్లకు చేరవలసిన పరిస్థితి నెలకొంది. మరో వైపు ఈ వర్షం వరి రైతుకు తీవ్ర ఇబ్బందులు తెచ్చి పెట్టింది. కొయ్యూరు, జీకే వీధి మండలం దారకొండ, దుప్పిలివాడ, కొమ్ములవాడ తదితర ప్రాంతాల్లో వరి పంటలు కోసి పొలం వేయడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. మినుములు, సామలు కోసి పొలాల్లో కుప్పలుగా వేశామని, అవి కూడా తడిచి పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

కరాటే క్రీడాకారునికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం చేస్తున్న శ్యామ్ గణేష్.

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఈ నెల 24-26 తేదీలో విశాఖపట్నం పోర్టు స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో సీనియర్స్ బ్లాక్ బెల్ట్ - 55 కిలోల కేటగిరీలో ఎంపికైన అనంతగిరి మండలం పెద్దబిడ్డ గ్రామానికి చెందిన జన్ని టోనీకి పాంగి శ్యామ్ గణేష్ రూ.రెండు వేల ఆర్థిక సహాయం అందించారుజ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ఎంతో మందికి తనకు చేతనైన ఆర్థిక సహాయం చేస్తున్న శ్యామ్ గణేష్‌కు కోచ్ పాంగి చిట్టి బాబు, టోనీ కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

కరువు మండలంగా ప్రకటించాలి

మండల పరిషత్తు సమావేశంలో సభ్యులు డిమాండ్

ప్రగతి నివేదిక ఇస్తున్న అధికారులు, వేదికపై ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

ప్రజాశక్తి-విఆర్.పురం

తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, విఆర్.పురం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. ఎంపిపితో పాటు ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్, జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి, జెడ్పీటిసి రంగారెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. రామవరం, చిన్నమట్టపల్లి పంచాయతీల్లో విద్యుత్ సమస్యలు తలెత్తున్నాయయని, త్రీఫేస్ లైన్ ఇవ్వాలని సభ్యులు కోరారు. రేఖపల్లి, రాయిగూడెం పిహెచ్‌సిల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించాలన్నారు. ఈ సమావేశంలో చిన్నమట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్‌కుమార్, సర్పంచ్ వెట్టి లక్ష్మి, రేకపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, మంచిపిట్ట రామారావు, కార్యదర్శి రత్నకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం ఎంపిటిసి సభ్యులు పూనెం ప్రదీప్‌కుమార్

తాగునీటి పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని పెద్దర్కూర్ గ్రామ పంచాయితీ పరిధి బండారుగూడెం గ్రామంలో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ఆ పంచాయతీ సర్పంచ్ మడకం నాగమణి మంగళవారం పరిశీలించారు. గ్రామంలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో సర్పంచ్ నాగమణి గత అక్టోబర్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో గ్రౌండ్ వాటర్ సరిపడా లేదని, చేతి పంపుల ద్వారా నీళ్ల రావడం లేదని ఆ వినతిలో పేర్కొన్నారు. దీనికి కలెక్టర్ స్పందించి బండారుగూడెం గ్రామంలో తాగునీటి సమస్య తీర్చడానికి బోరు, మోటర్, పైప్‌లైన్, మినీ వాటర్ ట్యాంక్ మంజూరు చేశారు. దీంతో వీటి నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. పనులను పరిశీలించిన సర్పంచ్ నాగమణి విన్నవించిన వెంటనే సమస్యను పరిష్కరించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఎం నాయకులు పాయం సత్యనారాయణ, గ్రామ పెద్దలు కన్నపురెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ నాగమణి తదితరులు

రైతులను ఆదుకోవాలని ఉద్యమం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరుతూ త్వరలో ఉద్యమం చేపడతామని సిపిఐ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అంతాడ పంచాయతీ పరిధి గుమ్మలపాలెంలో సిపిఐ మండల సమితి సమావేశం మాజీ సర్పంచ్ కూడా కొండమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గిరిజనులకు ఒక ఇల్లు కూడా మంజూరు చేయలేదని, ఎపికి జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టును కట్టలేకపోయిందని పేర్కొన్నారు. బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చి గిరిజనులను అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో ఎంపిటిసి ఇరవాడ సత్యవేణి, సిపిఐ మండలం కార్యదర్శి ఇరవాడ దేముడు, రైతు సంఘం నేత శివలింక కొండలరావు, వియపు నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

సిలబస్ సకాలంలో పూర్తి చేయాలి

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అకడమిక్ ఇయర్‌కు అనుగుణంగా సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం కాకవాడ ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని రిజిస్టర్లు, స్టోర్ రూమ్, అన్ని తరగతి గదులను పరిశీలించారు. అనంతరం పిఒ మాట్లాడుతూ విద్యా బోధన ఏవిధంగా సాగుతుందా? మెనూ ప్రకారం ప్రతిరోజు ఆహార పదార్థాలు అందిస్తున్నారా? వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు జ్వరాలు వస్తే వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్యం చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, ప్రధానోపాధ్యాయులు జి.ఆనంద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

ప్రజాశక్తి -సీలేరు

పురిటి నొప్పులు వచ్చిన గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో అంబులెన్స్‌లో ప్రసవించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ కొమ్ములవాడ గ్రామానికి చెందిన గర్భిణి కాకూరి మంగమ్మకు మంగళవారం పురిటి నొప్పులు రావడంతో వెంటనే బంధువులు సీలేరు పిహెచ్‌సికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పీహెచ్సీ సిబ్బంది ఏపీ జెన్కో సిఎస్‌ఆర్ అంబులెన్స్‌లో కొమ్ములవాడ నుండి మంగమ్మను ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో చల్లనిశిల్ప వద్దకు వచ్చేసరికి పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌ను పక్కకు ఆపగా, కొన్ని క్షణాల్లోనే మంగమ్మ సుఖంగా ప్రసవించి పండింటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీ బిడ్డను సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి మంగమ్మ సుఖ ప్రసవానికి సహకరించిన ఏపీ జెన్కో వైద్యాధికారి వెంకటకృష్ణ, డ్రైవర్ భీష్మ, ఇఎమ్‌టి రవిచంద్రను పలువురు ప్రశంసించారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ఆటో, ఇతర వాహనాలు నడిపేవారు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. మండల కేంద్రం రేఖపల్లిలో మంగళవారం ఆటో యజమానులు, డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు అతివేగంగా నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా, సరైన రికార్డులు, లైసెన్సులు లేకపోయినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే అలా వ్యవహరించిన వాహనదారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ శ్రీను, ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

నేడు 4 మండలాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి -రంపచోడవరం

నేషనల్ హైవే 516ఇ రోడ్డు విస్తరణలో భాగంగా గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లోని గ్రామాలకు బుధవారం ఉదయం10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ఎమ్‌డి.యూసఫ్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు

ప్రజాశక్తి-కొయ్యూరు

వైసిపి ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చస్తున్నట్లు ఎంపిపి బడుగు రమేష్, వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, జెసిఎస్ కన్వీనర్ సుధాకర్ తెలిపారు. మండలంలోని మంప పంచాయతీ పరిధిలో వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైసిపి జెండా ఆవిష్కరణ చేసి, పథకాలు లబ్ధి జాబితా ఫ్లెక్సీని ఆవిష్కరించారు. గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అందించే ప్రతి కార్యక్రమం ప్రతి లబ్ధిదారునికి అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ త్రినాథ్ పడాల్, కన్వీనర్లు ఆగురు రాంబాబు, పుష్ప, వాసు, అరిమేల కొండబాబు, సచివాలయ కార్యదర్శి పవన్, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి రమేష్ తదితరులు

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్

కోర్టు ఫీజులతోనే గిరిజనులకు న్యాయసేవలు

ప్రజాశక్తి- చింతపల్లి: కోర్టు ఫీజులతోనే గిరిజనులకు న్యాయసేవలు అందించేందుకు ఆదివాసీ గిరిజనసంఘం ఆధ్వర్యంలో చింతపల్లి మండల కమిటీ ద్వారా అడ్వకేట్ అందుబాటులో ఉంటారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ వెల్లడించారు. మంగళవారం చింతపల్లిలోసంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి ఆధ్వర్యంలో గిరిజన సంఘం మండల కమిటీ సమావేశం అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, మన్యంలో గిరిజనులు, యువత లేనిపోని కేసుల్లో ఇరుక్కుని, న్యాయసేవలకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో న్యాయవిద్యను పూర్తిచేసి, గిరిజన లా అసోసియేట్ సభ్యుడు, అడ్వకేట్గా సేవలను అందిస్తున్న లాయర్ ప్రదీప్‌కుమార్‌తో మాట్లాడి కేసుల్లో ఇరుక్కున్న గిరిజనులకు కేవలం కోర్టు ఫీజులతోనే న్యాయపరమైన సేవలు అందించటానికి ఒప్పించామన్నారు. అంతేకాక గిరిజనులకు అవసరమైన న్యాయ సలహాలు సూచనలు ఆయన అందిస్తారన్నారు. భూతగాదాలు వంటి సివిల్ కేసులతోపాటు క్రిమినల్ కేసులకు గిరిజనులకు లాయర్ ప్రదీప్‌కుమార్ అండగా ఉండి సేవలు అందిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ అభ్యర్థనను మన్నించి, గిరిజనులకు ఎటువంటి ఫీజు లేకుండా న్యాయసేవలు అందించేందుకు ముందుకు వచ్చిన న్యాయవాది ప్రదీప్‌కుమార్‌కు ఆదివాసీ గిరిజన సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. న్యాయ సలహాలకు 6305141680 ఫోను నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కొయ్యూరు ఆర్‌టిఐ మెంబర్ సురబోయిన సతీష్ కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు రాంబాబు, కూడా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండ

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి. చింతపల్లి: అగ్నిప్రమాదంలో చిన్నారి సజీవ దహనమైన కేసులో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి భరోసానిచ్చారు. మంగళవారం అన్నవరం గ్రామాన్ని సందర్శించి, అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి నిత్య కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తెను కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి తనవంతుగా ఆర్థికసాయం చేశారు. చింతపల్లి ఎంపిపి కోరాబు అనూషాదేవి, జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య పడాల్ కూడా ఆర్థిక సాయం అందించారు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వంనుంచి ఆర్థికసాయంతోపాటు ఇళ్లు మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి హామీనిచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎంపిటిసి బాబూరావు, సర్పంచ్ బండ సింహాచలం, వైసిపి మండల అధ్యక్షులు మోరి రవి, ఎంపిటిసి పద్మ, కోఆప్షన్ సభ్యులు నాజర్ వలి, ఫాస్టర్లు కిల్లో సుబ్బారావు, గెమ్మిలి సుందరరావు, సచివాలయ సిబ్బంది, అధికారులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

పాడేరు: మండలంలోని అన్నవరం పంచాయతీ కేంద్రంలో అగ్నిప్రమాదంలో మృతి చెందిన ఏడేళ్ల చిన్నారి నిత్య కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి సత్యనారాయణ, ఎపి గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చిన్నపాకలో తినుబండారాల తయారీ, అమ్మకంతో జీవనం సాగిస్తున్న గెమ్మెల రాజేష్ కుటుంబం, సోమవారం అన్నవరం సంత కావడంతో ఉదయం అరిసెలు తయారు చేసేందుకు కట్టెల పొయ్యిపై నూనె పెట్టి పిండి కలిపేందుకని ఇంటి లోపలికి వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు మరుగుతున్న నూనె కట్టెలపై పడి మంటలు చెలరేగడంతో కళ్ల ముందే ఏడేళ్ల కూతురు నిత్యను కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పూర్తి భరోసానిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఇద్దరు మావోయిస్టులు, ముగ్గురు మిలీషియా సభ్యుల లొంగుబాటు

అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా వెల్లడి

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి -పాడేరు: ఒడిశా రాష్ట్రం పప్పులూరు దళానికి చెందిన సిపిఐ(ఎంఎల్) మావోయిస్టుకు చెందిన ఇద్దరు దళసభ్యులతో పాటు ముగ్గురు మిలీషియా సభ్యులు స్వచ్ఛందంగా తమ వద్ద లొంగిపోయినట్లు అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా వెల్లడించారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒడిశా మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ ఈతలంక గ్రామానికి చెందిన కిల్లో త్రినాథ్ అలియాస్ రాజేష్, అదే గ్రామానికి చెందిన కిల్లో బాబూరావు అలియాస్ సుత్తి అనే ఇద్దరు మావోయిస్టులు పప్పులూరు ఏరియా దళ కమాండర్ పార్వతి ప్రోద్బలంతో 2008లో మిలీషియా సభ్యులుగా చేరి, ఏడాది కాలంలోనే పార్టీ సభ్యులుగా ఎదిగారని, ఎఒబిలో దళ సభ్యులుగా ఎదురుకాల్పుల ఘటనలు, కరువు దాడులు, బ్లాస్టింగ్ సంఘటనల్లో వీరిద్దరూ పాల్గొన్నారని వెల్లడించారు. వీరితోపాటు. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ గంజాయి మల్ల గ్రామానికి చెందిన కిల్లో రాజు. పల్లి గూడ గ్రామానికి చెందిన వంతాల భగత్‌రాం, పాంగి సదును అనే మరో ముగ్గురు మిలీషియా సభ్యులు లొంగిపోయారని తెలిపారు వీరుకూడా పలు నేర ఘటనలలో పాల్గొన్నారన్నారు.

మావోయిస్టు పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గడం, పోలీస్ గస్తీ క్యాంపులు పెరగడం, ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో ఎపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతోపాటు అల్లూరి జిల్లా పోలీస్ నిర్వహిస్తున్న కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్, నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పనకు ఉచిత శిక్షణ కార్యక్రమాలు వంటి కార్యక్రమాలల ప్రభావంతో తమకు పునరావాసం లభిస్తుందన్న నమ్మకంతో వీరు మావోయిస్టు పార్టీని వీడి, స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతపల్లి అడిషనల్ ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్, అడిషనల్ ఎస్పి (అడ్మిన్) పి అనిల్‌కుమార్, సీలేరు 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి సురేష్, జీకే వీధి సిఐ జి అశోక్‌కుమార్, సీలేరు ఎస్‌ఐ జె.రామకృష్ణ, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీత

వాడీవేడిగా అనంతగిరి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -అనంతగిరి : సమస్యలపై నిరసనలు, నిలదీతల మధ్య మండల సర్వసభ్యసమావేశం వాడీవేడిగా సాగింది. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శెట్టి నీలవేణి అధ్యక్షతన నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా మధ్యాహ్నం 12గంటలకు మండల సమావేశం ప్రారంభమైంది. మన్యంలో రహదారి పనులకు అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెప్పడంతో పనులు జరగడం లేదని పలువురు సభ్యులు మండిపడి, అధికారులను నిలదీశారు. అనంతగిరి పంచాయతీ, హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పరిధి పివిటిజి గ్రామమైన డెక్కపురం. పట్కదౌవడ ,గుమ్మకోట పంచాయతీ పరిధి శంకుపర్తి, గాలిపాడు, మెట్టవలస, లుంగపర్తి, కివర్ల పంచాయతీకు మంజూరైన రోడ్డులకు ఫారెస్ట్ అధికారులు ఎందుకు ఆటంకం కలిగిస్తున్నారనిసర్పంచ్ కిల్లో మొస్య, జె.అప్పారావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా వైస్ ఎంపిపి జయవర్ధని పలువురు ఎంపిటిసిలు నిలదీశారు. తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని, లేకుంటే ఆ గ్రామాల ప్రజలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాన్ షెడ్యూల్ పంచాయతీ పరిధిలో సాగులో ఉన్న భూములపై రీసర్వేలు నిర్వహించి గిరిజన సాగుదారులకు హక్కు కల్పించాలని కోరారు. రెవెన్యూ అధికారుల ముడుపులకు ప్రలోభపడి, భూస్వాములకు ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారని ప్రశ్నించారు. అనంతగిరి పంచాయతీ పాతకోట గ్రామంలో ఏకలవ్య పాఠశాల ఏర్పాటుకు 18 ఎకరాల జిరాయితీ భూములు ఇచ్చిన ఏడుగురు రైతులకు వేరే చోట భూములు కేటాయించకుండా రెవిన్యూ అధికారులు తాత్సారం చేయడంపై జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అనంతగిరి కరువు మండలంగా ప్రకటించాలని, ఫారెస్ట్ ఆటంకంతో నిలిచిపోయిన రోడ్లకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని, గుంతలుగా ఏర్పడిన అనంతగిరి ఘాట్ రోడ్, అరకు రోడ్లకు మరమత్తు పనులు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి, జెడ్‌పిటిసిలు మాట్లాడుతూ, మండల సభల్లో ప్రతిసారి వచ్చిన సమస్యలే మళ్లీమళ్లీ వస్తున్నాయంటే, సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఎంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో స్పష్టమౌతోందని, ఇప్పటికైనా తీరు మార్చుకుని, మండల సభలో ప్రస్తావ-నకు వచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హర్షిత్ రాజ్యం, తహశీల్దార్ రామ్‌భాయి సర్పంచ్ ఎస్.రూతు, రాములమ్మ పాల్గొన్నారు

సభలో సమస్యలపై ప్రశ్నిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

చెట్లు తొలగింపునకు సహకరించండి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1 ఆవరణలో ప్రమాదభరితంగా ఉన్న భారీ చెట్లను తొలగించేందుకు పాడేరు ఫారెస్ట్ డివిజనల్ అధికారికి, జిల్లా కలెక్టర్డ్, డివిజన్ విద్యుత్ శాఖ వారి నుండి ప్రత్యేక అనుమతులు పొందిన నేపథ్యంలో వాటిని తొలగించేందుకు సహకరించాలని హెచ్‌ఎం కె.లక్ష్మి కోరారు. ఈనెల 23 ,24 తేదీలతో, 26,27 తేదీలలో పాఠశాల ఆవరణలోని చెట్లు తొలగింపు పనులు చేపట్టాలని నిర్ణయించామన్నారు. భారీ వక్షాల వల్ల పాఠశాల భవనాలకు, విద్యార్థినులకు ప్రమాదం పొంచి వున్న నేపథ్యంలో వీటిని తొలగిస్తున్నామని, ఆయా రోజుల్లో విద్యుత్ శాఖ సిబ్బంది, మండల ప్రజలు, పరిసర దుకాణ నిర్వాహకులు ఈ మేరకు సహకరించాలని కోరారు.

రగ్గులు పంపిణీ చేస్తున్న ఆనంద్, తదితరులు

ప్రజాశక్తి విలేకరి ఔదార్యం

- 11 కుటుంబాలకు రగ్గుల వితరణ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని అండిభ పంచాయతీ కంచురాయి గ్రామంలో 11 కుటుంబాలకు తన సొంత నిధులతో రగ్గులను పంపిణీ చేసి స్థానిక ప్రజాశక్తి విలేకరి కె.ఆనంద్‌కుమార్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మంగళవారం హుకుంపేట మండలం యునైటెడ్ ఫాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫెలోషిప్ అధ్యక్ష కార్యదర్శులు వి.మోజేస్, కె.జేమ్స్ ఆధ్వర్యంలో వీటిని నిరుపేద కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాశక్తి విలేకరి వృత్తి చేస్తూనే తనకు ఉన్న దాంట్లో ఇతరులకు పంచి సేవచేస్తున్న ఆనంద్ సేవాభావం ప్రశంసనీయమని కొనియాడారు. గ్రామస్తులు కొర్రా నాగరాజు, కొర్రా సూరిబాబు ఆనంద్ సేవాభావాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాస్టర్స్ సోమరాజు, సత్యారావు, మీడియా ప్రతినిధులు కనకరాజు, మూర్తి, బాలు, పాల్గొన్నారు.

అదనంగా ఆరు ఆధార్ సేవా కేంద్రాలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ఆధార్ సేవలకు గిరిజనులు ఇబ్బంలు పడకుండా మండలంలో ప్రస్తుతమున్న రెండు కేంద్రాలకు అదనంగా మరో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే మండలంలో కించాయిపుట్టు, సుజనకోట సచివాలయాల్లో ఆదార్ నమోదు కేంద్రాలున్నాయని, ఇపుడు కొత్తగా కిలగాడ, మాకవరం, వనుగుమ్మ, బుంగపుట్టు, లక్ష్మీపురం, బూసిపుట్టు గ్రామ సచివాలయాలలో అదనంగా ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్ అప్డేట్, అడ్రస్ మార్పిడి, ఇతర సవరణల సేవలకు మండలంలోని 23 పంచాయతీల ప్రజలు ఎనిమిది ఆధార్‌కేంద్రాల సేవలను వినియోగించుకోవలని ఎంపిడిఒ సూచించారు.

జిసిసి సబ్బుల తయారీ పరిశ్రమను తెరిపించండి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రభుత్వ విధానాల వల్ల కొంతకాలంగా మూతబడిన జిసిసి సబ్బుల తయారీ పరిశ్రమను తక్షణం తెరిపించి కార్మికులకు భద్రత కల్పించాలని జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అరకువేలి పర్యటనలో ఉన్న ఎమ్మెల్సీ కుంభ రవిబాబును మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు.జిసిసి షోప్ యూనిట్ పరిశ్రమం మూతబడటం వలన పలువురు కార్మికులు ఉపాధి కోల్పోయి కుటుంబాలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్సీ రవిబాబు స్పందిస్తూ, వెంటనే సబ్బుల తయారీ.పరిశ్రమను తెరిపించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని యూనియన్ కార్యదర్శి సింహాద్రి, ప్రభాకర్, దాసు తెలిపారు. పరిశ్రమను తెరిపించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ కుంభా రవిబాబుకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

సదస్సులో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులు

పారిశ్రామిక ప్రగతికి నదీ జలాల రవాణా కీలకం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి నదీ జలాల ద్వారా సరుకుల రవాణాకు ప్రాధాన్యమివ్వడం వల్ల లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించుకోవచ్చని పలువురు పారిశ్రామిక వేత్తలు, పారిశ్రామిక సంస్థలకు చెందిన ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. మంగళవారం ఉదయం విశాఖలోని నోవటల్ హోటల్‌లో కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ఎపి ఆధ్వర్యాన 'పోర్ట్స్, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ ట్రాన్స్‌పోర్టేషన్' అన్న అంశంపై రెండు సెషన్లుగా సదస్సు జరిగింది. పలు రంగాలకు చెందిన పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రావణ్ షిప్పింగ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి సాంబశివరావు పేనల్ చర్చలకు అధ్యక్షత వహించారు.

అభివృద్ధిలో పోర్టులు, లాజిస్టిక్స్ పాత్ర : లాల్ కృష్ణ

సిఐఐ విశాఖపట్నం ఛైర్మన్ డాక్టర్ పిపి.లాల్ కృష్ణ మాట్లాడుతూ అభివృద్ధికి గేట్ వేగా విశాఖ ఉండడంతో వ్యాపారం, పెట్టుబడులకు వ్యూహాత్మక ప్రాధాన్యత ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పోర్టులు, లాజిస్టిక్స్ రంగంలో ఉపాధి, ఆర్థికాభివృద్ధికి విశాఖ కేంద్రంగా నిలిచిందని, ఎపి ప్రభుత్వం అందుకు తగ్గ సహకారాన్ని అందిస్తోందని కొనియాడారు. సిఐఐ కన్వీనర్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ లాజిస్టిక్స్ పేనల్) జి.సాంబశివరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి కావాలంటే రోడ్లు, కారిడార్‌లు రవాణాకు విస్తరించి ఉండాలని, పార్కింగ్ సదుపాయాలు డిమాండ్‌కు తగ్గట్టు ఉండాలని సూచించారు. గతంలో ఇండస్ట్రియల్ ఏరియా ఎల్‌పిజి, పెట్రోలింగ్ క్రూడాయిల్ వాహనాలతో విశాఖ రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందిగా ఉండేదని, పదేళ్లలో చాలా మార్పు వచ్చిందని, పైప్‌లైన్ ద్వారా రవాణా జరిగి ఇబ్బందులు చాలా వరకూ తొలగాయని అన్నారు. దేశంలో పారిశ్రామిక ప్రాజెక్టులకు ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

వైజాగ్ పోర్టు, ఎన్‌హెచ్‌ఎఐ కృషితో సమస్యలు పరిష్కారం : కాంకర్ జిఎం కెవిఎస్‌ఆర్‌కె కిశోర్

మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు విశాఖలో ఏర్పాటయిన తొలిరోజుల్లో కొన్ని లాజిస్టిక్స్ సమస్యలుండేవని వైజాగ్ పోర్టు, నేషనల్ హైవే అథారిటీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఫ్లై ఓవర్‌లు షీలానగర్ వరకూ రావడం వల్ల కాంకర్ బిజినెస్ సజావుగా సాగుతోందని కాంకర్ జిఎం కెవిఎస్‌ఆర్‌కె.కిశోర్ తెలిపారు. తూర్పు కోస్తా రైల్వే అధికారి దిబ్బంజన్ రాయ్ మాట్లాడుతూ ఎపిలో పారిశ్రామిక ప్రగతికి అవసరమైన సహకారం తూర్పుకోస్తా రైల్వే నుంచి అందిస్తున్నామన్నారు. రైల్ కార్గోతో ఎపి అభివృద్ధి సాధ్యమయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విశాఖ-రాయపూర్ రైల్వే లైన్ అభివృద్ధితో సమస్యలు తొలగుతాయన్నారు.

ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్‌తో ప్రగతి: ఎస్‌వికె రెడ్డి

పర్యావరణ సహిత రవాణా కోసం నదుల ద్వారా సరుకు రవాణా చేయడం వల్ల ఆర్థిక భారాలు 80 శాతం (రోడ్డు, రైల్వే) కంటే తగ్గిపోతాయని ఎపి ఇన్‌లాండ్ వాటర్‌వేస్ సిఇఒ ఎస్‌వికె.రెడ్డి వెల్లడించారు. 125 ట్రక్కులు రోడ్డుపై ఎంత సరకు రవాణా చేస్తాయో ఒక వెసెల్‌తో ఇన్‌లాండ్ వాటర్ ద్వారా గమ్యస్థానానికి అలానే సరుకును చేర్చవచ్చని ఉదాహరణగా చెప్పుకొచ్చారు. ఇది ఆర్థికంగా కూడా రాష్ట్ర ప్రగతికి తోడ్పడుతుందని తెలిపారు.

ఎన్‌ఎంయు రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌టిసిలో 1/2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపిఎస్ ఆర్‌టిసి ఎన్‌ఎంయు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సంఘం రాష్ట్ర కార్యదర్శులు పిపిఎం.రాజు, జిఆర్.రావు తదితరులు మాట్లాడారు. ఎఎస్‌లు ఇవ్వాలని, అన్ని కేటగిరీల్లోని ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

అసలేం జరుగుతోంది ?

- హెటిరో రెండో పైపులైన్ నిర్మాణ ప్రాంతంపై వీడని అనుమానాలు
- స్థల నిర్ధారణ చేయని రెవెన్యూ, అటవీశాఖ అధికారులు
- ఎలైన్‌మెన్ కాపీని బయటపెట్టని సదరు కంపెనీ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

హెటిరో డ్రగ్స్ కంపెనీ రెండో పైపులైన్ పనులపై వచ్చిన ఫిర్యాదుపై ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక లేకపోవడం విమర్శలకు, పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ, అటవీశాఖ స్థలాల్లో పైప్‌లైన్ నిర్మాణ పనులు హెటిరో చేపడుతోందని కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ, అటవీ శాఖాధికారుల దృష్టికి ఇప్పటికే సిపిఎం తీసుకెళ్లింది. ప్రస్తుతం హెటిరో చేపడుతున్న నిర్మాణ పనుల ఎలైన్‌మెంట్ వివరాలు తెప్పించుకొని సర్వే చేయిస్తామని రెండు శాఖల అధికారులూ కొంతకాలం చెప్పుకొచ్చారు. ప్రభుత్వ స్థలాల్లో పైపులైన్ నిర్మాణ పనులు చేపడితే ఆ పనులు నిలిపివేసి, కేసులు నమోదుచేస్తామని అన్నారు. అయితే, ప్రభుత్వ స్థలాల్లో సదరు కంపెనీ పైప్‌లైన్ నిర్మిస్తోందని సిపిఎం ఫిర్యాదుచేసి పది రోజులవుతున్నా పైప్‌లైన్ నిర్మాణ స్థలం ఎవరిదనేది ఇంతవరకు రెవెన్యూ, అటవీశాఖలు తేల్చి చెప్పలేకపోయాయి. పైప్‌లైన్ తమ స్థలంలో నిర్మిస్తున్నామని హెటిరో కంపెనీ ప్రచారం చేసుకుంటోంది. కానీ ప్రభుత్వ స్థలంలో పైప్‌లైన్‌ను హెటిరో నిర్మించడం లేదని ప్రభుత్వ అధికారులు ఈ నాటికీ చెప్పలేకపోతున్నారు.

సముద్రం నుంచి కంపెనీ వైపు వేసుకొని వస్తున్న పైప్‌లైన్ స్థలం హెటిరోకు ఎప్పుడు, ఎలా దఖలు పడిందో రెవెన్యూ, అటవీ శాఖాధికారులకు తెలియకుండా వుండదు. పోనీ... ఇంతవరకు తెలియకపోయినా, ప్రస్తుతం పైప్‌లైన్ నిర్మిస్తున్న స్థలం ఎవరిదనేది తెలుసుకోవడం ఆ శాఖలకు పెద్ద కష్టమేమీకాదు. బిఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడైన పార్థసారథిరెడ్డి హెటిరో గ్రూపు ఛైర్మన్ కావడంతో అధికారులెవరూ కంపెనీ ఉల్లంఘనల జోలికి వెళ్లడంలేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అందుకనే, సర్వే పేరుతో పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తయ్యే వరకూ కాలయాపన చేయాలని అధికారులు చూస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్‌ఒ) ఆ గ్రామంలోని ఏ సర్వే నెంబర్‌లోని ఎంత విస్తీర్ణంలో, ఏ స్వభావం కలిగిన ప్రభుత్వ భూమి వుందో చెప్పగలుగుతారు. అయినా పైప్‌లైన్ ఎలైన్‌మెంట్ లేకపోవడంతో సర్వే చేయలేకపోతున్నామంటూ రెవెన్యూ, అటవీశాఖల అధికారులు కాలం నెట్టుకురావడం గమనార్హం.

హెటిరో ఏర్పాటు చేస్తున్న పైపులైన్లు ఇవే..

స్థానికులేంటున్నారు ?

హెటిరో కంపెనీ డిశ్చార్జ్ పాయింట్ నుంచి సముద్రం వరకు 2.3 కిలోమీటర్లలో వేసే పైప్‌లైన్‌లో కొంతభాగం ప్రభుత్వ, అటవీ శాఖల స్థలమని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ స్థలాల్లో రెండో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టడంలేదని చెబుతున్న హెటిరో ప్రతినిధులు నిర్మాణ పనుల ఎలైన్‌మెంట్ కాపీని రహస్యంగా వుంచుతున్నారు. ఆ కాపీని పరిసర సచివాలయ కార్యాలయాల్లో ప్రదర్శించినా అనుమానాలు కొంతవరకు తొలగే అవకాశముండేది. కానీ కంపెనీ ఆ పని చేయడం లేదు. అటు హెటిరో, ఇటు ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించకపోవడంతో ప్రభుత్వ స్థలంలోనే హెటిరో పైప్‌లైన్ నిర్మిస్తోందన్న విమర్శలకు బలం చేకూరుతోంది.

1న విభిన్న ప్రతిభావంతుల టాలెంట్ షో

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 1న లయన్స్ క్లబ్ విశాఖపట్నం, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా రామ్ నగర్ లయన్స్ క్లబ్‌లో విభిన్న ప్రతిభావంతులకు టాలెంట్ షో నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధి డి.ప్రసాద్ రాజు, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ కె.సుశీల మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. జిల్లాలో వీరి కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న సంస్థలు పిల్లలను ప్రోత్సహించి ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విభిన్న ప్రతిభావంతుల నైపుణ్యాలను గుర్తించి, వారి ఆసక్తికి తగ్గట్టుగా ప్రోత్సహించి, తర్ఫీదునిచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలని తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 18 సంవత్సరాలలోపు వయసు వరకు పిల్లలు పాల్గొనవచ్చునన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్, అదే విధంగా గెలిచిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు 9392632790, 7893495537 నెంబర్లకు ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమ కో-ఆర్డినేటర్లుగా లయన్ ప్రొఫెసర్ ఎన్‌విఎన్.దుర్గాప్రసాదరావు, విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కొరెడ్ల రమాప్రభ వ్యవహరిస్తారన్నారు.

విశాఖలో ఇండియన్ - 2 షూటింగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో కమల్ హాసన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఇండియన్ - 2 చిత్రం షూటింగ్ సిరిపురంలోని ఆల్ ఇండియా రేడియో ప్రాంతంలో మంగళవారం నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది

కోస్ట్ గార్డ్ రీజియన్ కమాండర్‌గా డానీ మైఖేల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోస్ట్ గార్డ్ రీజియన్ (తూర్పు) కమాండర్‌గా డానీ మైఖేల్ పగ్గాలు చేపట్టారు. మంగళవారం చెన్నైలోని కోస్ట్ గార్డ్ ఎయిర్ స్టేషన్‌లో జరిగిన ఉత్సవ పరేడ్‌లో ప్రస్తుత ఐజి ఎపి బడోలా నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సింహాచలం కొండపై నుంచి దిగువకు మరో ఘాట్ రోడ్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సింహాచలం దేవస్థానం పై నుంచి కిందకు దిగేందుకు వీలుగా మరో ఘాట్ రోడ్డును నిర్మించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే దేవస్థానం అధికారులు రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే తొలి పావంచా నుంచి కొండపైకి ప్రస్తుతం ఉన్న రహదారిని దశావతారం జంక్షన్ నుంచి 2.5 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు ప్రణాళికలు రచించారు. ఈ మేరకు వాటి సాధ్యాసాధ్యాలపై వివిధ విభాగాల అధికారులతో జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ స్థానిక విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు.

నాటుసారా బట్టీపై దాడి

- 800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ చిన్నరెల్లంగిపాడు గ్రామ శివారు అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేసే బట్టీపై ముందస్తు సమాచారం మేరకు రాజవొమ్మంగి సీఐ షేక్ బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.వెంకయ్య, పోలీసు సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 800 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా బట్టీ నిర్వహిస్తున్న రాజుపేట గ్రామానికి చెందిన వంతల నాగేశ్వరరావును అరెస్టు చేశారు. మరో ఇద్దరు సారాబట్టీ నిర్వాహకులు పరారైనట్లు సీఐ బాజీ లాల్ తెలిపారు. నిందితుడు వద్ద నుండి 20 లీటర్ల నాటుసారా, సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు, పాత్రలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అడ్డతీగల కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు చెప్పారు. గతంలో సారా కేసుల్లో పట్టుబడ్డిన నిందితులు మళ్లీ సారా విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై హెచ్‌సి దుర్గారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనపై శిక్షణ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో లాలం సీతయ్య ఆధ్వర్యంలో కుల గణనపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ కులగణన ప్రాముఖ్యత గురించి వివరించి, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, కులగణనను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో చైతన్య, వైసిపి మండల అధ్యక్షుడు జల్లి బాబులు, మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

అటవీ కలప స్వాధీనం

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధి జువ్విరేవుల గ్రామంలో అక్రమంగా నిల్వ చేసి, రవాణాకు సిద్ధంగా ఉంచిన అటవీ కలపను ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంప ఫారెస్టు గార్డు రాకేష్ కుమార్, కాకరపాడు ఫారెస్టు గార్డు రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... ముందస్తుగా అందిన సమాచారం మేరకు అటవీశాఖ సిబ్బంది దాడులు నిర్వహించగా, ఎనిమిది గంద్ర ముక్కలు పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని కాకరపాడులో ఉన్న అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, అటవీ కలప అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బంగాళాఖాతంలో గైడెడ్ ఫ్లైట్ ట్రయల్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి నావల్ యాంటీ షిప్ మిస్సైల్ గైడెడ్ ఫ్లైట్ ట్రయల్స్‌ను చేపట్టారు. సీకింగ్ 42 బి హెలికాప్టర్ నుంచి ట్రయల్స్‌ను డిఆర్‌డిఒ సహకారంతో భారత నౌకాదళం మంగళవారం బంగాళాఖాతంలో విజయవంతంగా చేపట్టింది. క్షిపణి సాంకేతిక పరిజ్ఞానం, మార్గదర్శక సాంకేతిక పరిజ్ఞానంలో స్వావలంబన సాధించే దిశగా ఈ ప్రయోగం ఒక ముఖ్యఘట్టమని అధికారులు తెలిపారు .

భారత్, ఆసీస్ టి - 20 మ్యాచ్‌కు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖలోని ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో గురువారం జరగనున్న ఇండియా - ఆస్ట్రేలియా తొలి టి-20 అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు కలెక్టర్ మల్లికార్జున, సిటీ పోలీస్ కమిషనర్ రవిశంకర్, ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయ మ్యాచ్‌ను దృష్టిలో ఉంచుకొని మంగళవారం పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో వారు ఆర్గనైజింగ్ కమిటీ ఆఖరి సమావేశం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ట్రాఫిక్ విభాగంలో సమస్యలు తలెత్తకుండా డిఎస్‌పి స్థాయి అధికారులను నియమించామని సీపీ రవిశంకర్ పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో జగనన్న కాలనీ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం సిరిపురంలోని విఎమ్‌ఆర్‌డిఎ కార్యాలయం నుంచి హౌసింగ్, విఎంఆర్‌డిఎ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పలు శాఖల అధికారులతో ఇండ్ల నిర్మాణ ప్రగతిపై వెబెక్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఇళ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలుపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.